# వ్యాస కౌముది



## చాటువులు - దూర్వాసుల వేంకట సుబ్బారావు



విజయనగరం ప్రభువులు సంగీత పోషకులు కదా, మా కీర్తి నీవలనే కదా అని చమత్కరిస్తూ సంగీతంలో సరిగమపదనిస బీజాక్షరాలతో ఇలా చమత్కరించరు ఈ తిరుపతి వేంకట జంటకవులు.

మాపసమా నీ సాగమ
గాపసం మాపధాపగాగమనిసమా
మా పస నీపస గనిగా
దా! పరిపరి తుష్టి చెందె నా నంద నృపా!

అటు గద్యాలు నుంచి ఇటు చెన్న పట్నంవరకూ ఎన్నెన్నో శతావధానాలు చేసిన తిరుపతి వేంకట కవుల పటిమ, కవితామాధురి "నానారాజు సందర్శనము" నుంచి చదివి ఆనందించవలసినదే తెలుగు భాష యందు భక్తి పెంచుకోమని బందరులో ఇలా ప్రార్థన చేస్తూ హెచ్చరించారు వీరు:

ఆంధ్రదేశీయులార మీరందఱొక్క
ప్రార్థనను గైకొనుడు దేవ భాషయందు
కొంచెమేని పరిశ్రమ కొనవలెజుడి
దాన సులభంబుగా మీకు దనరు దెవ్వి

ఈ తిరుపతి వేంకట కవులు తమ ప్రజ్ఞతో యావత్ ఆంధ్రుని ముగ్ధుల్ని చేసారు. వీరి శిష్య జాబితాలో ఎందరో మహాకవులున్నారు. ఉదాహరణకు వేటూరి ప్రభాకర శాస్త్రి, వేటూరి శివరామశాస్త్రి, త్రిపురనేని రామస్వామి చౌదరి, దీపాల పిచ్చయ్య శాస్త్రి తదితరులు. తమ ఊర్లో కొబ్బరి చెట్లను పృచ్ఛకులుగా భావించి కవిత్వం చెప్పేవారట వీరు. వీరికి శతఘంట కవనము, అష్టావధానాలు, ఆశుకవిత్వం సులభసాధ్యాలు. నానారాజ సందర్శనంలో "ఏనుగు నెక్కినాము, ధరణీంద్రులు చూడగ నిక్కినాము, సన్మానములందినాము, బహుమానములన్ గ్రహించినారమెవ్వానిని లెక్క సేయక" అని తమ గురించి తెలియజేసిన ధీరులు. వనపర్తి రాజుకొలువులో

రాజమిత్రుల మదికాక రాజబంధు
వులము కవిరాజులము, పలువురు గలట్టి
కులము వారము, మాకెందు గొడవలేదు
కీర్తికై రాక సుమి వనపర్తి భూప!

అని తమ గురించి ఒక చాటువులో చెప్పారు.

సాంపరాయని శ్రీనాథుడు "అక్షయంబుగ సాంపరాయని తెనుంగా ధీశ కస్తూరికా! బిక్షాదానము సేయ రా సుకవిరాట్ బ్రందారక శ్రేణికిన్" అన్నట్లే వీరిర్వురు కవులను సన్మానించుట రాజుల విధి మమ్ముల నిరసించుట క్షేమమ్ముకాదు అని హెచ్చరిస్తూ ఈ చాటువు రూపంలో నిలదీసి అడిగారు.

అమ్మ వంక జుట్టమా యేమి భోజ భూపాల వర్యున కల్ల కాళిదాసు
అబ్బ వంక జుట్టమా యేమి విక్రమ ప్రభువరేణ్యున కల్ల భట్టి సుకవి
అత్త వంకను జుట్టమా యేమి రాజధరాధీశ్వరునకు నన్నయ భట్టు
మామవంక జుట్టమా యేమి కృష్ణరాడ్ధరణీశ్వరునకు పెద్దన్నగారు
కవి యయిన వాని నెల్లను గారవింప
రాజయిన వానికెల్ల ధర్మమ్ముగాక

వేరొక చోట "గురుడున్ దైవము లేడు సత్కవులకుం గోపంబురానీకుమా" అని వారి ఉపాస్యదేవత కాళికాదేవితో ఘాటుగా చెప్పారు.

వీరికి దర్శనమీయక జాప్యం చేస్తున్న విశాఖపట్న నివాసి గొడే గజపతి రావు గురించి ఒక చాటువులో ఇలా ఎత్తి పొడిచారు:

సంగరశక్తిలేదు, వ్యవసాయము సేయుట సున్న, సంతలో
నంగడి వేసి యమ్ముటది యంతకు మున్నెహుళక్కి, ముష్టికిన్
బొంగు భుజాన వైచుకుని పోయెద మెక్కడికేని, ముష్టి చెం
బుంగొని పెట్టు మొక్కటి యమోఘ మిదేకద! దంతి రాణ్ముపా!

వీరి హాస్యాస్పదమైనవి, చమత్కారమైన చాటువులు చాలా ఉన్నాయి. ఒక పకోడి ప్రియునకు పకోడి ఎలా తయారు చేయాలో కూడ ఒక చాటువులో చెప్పారు:

సెనగపిండి ఉల్లిపాయ చిన్న మిరపకాయలుం
జొనిపి యందునల్లమింత చొన్పి, ముద్ద చేసియున్
అనల తప్తమైన నేతియందు వైచి వేచినన్
జను పకోడి యనెడి పేర జక్కనైన ఖాద్యమై

మీరు వైదీకులు కదా, మీసం ఎందుకు పెంచారని వీరిని ప్రశ్నిస్తే వారి జవాబే ఒక సవాల్

దోసమటం బెరింగెయ దుందుడు కొప్పగ పెంచినారము ఈ
మీసము, మేమె ఉభయ భాషా కవీంద్రుల మంచు తెల్పగా
కాదని కవి వరేణ్యులు గెల్వుడు, గెల్చిరేని ఈ
మీసము తీసి మీ పదసమీపము నుంచి తల వంచి మ్రొక్కమే!!

మనకందరికీ తెల్సినవాడు తెనాలి రామకృష్ణుడు - "కుంజర యుద్ధంబు దోమ కుత్తుక జొచ్చెన్" అన్న సమస్యను

గంజాయి త్రావి తురకల
సంజాతుల గూడి కల్లు చవిగొన్నావా ఓరీ
లంజల కొడకా ఎక్కడ

కుంజర యూథంబు దోమకుత్తుక జొచ్చెన్

అని దూషిస్తూ పూర్తి చేసాడు. సభా మర్యాదక భంగం కలగకుండా, అదే సమస్యని కృష్ణదేవరాయల కోరికపై

రంజన చెడి పాండవులరి
భంజనులై విరట గొల్వ చాల్పడి రకటా
సంజయ ఏమని చెప్పుదు
కుంజర యూథంబుదోను కుత్తుక జొచ్చెన్.

అని చక్కగా పూరించాడు.

వేరొక కవి "మంగళ సూత్రము నెంత మదినమ్మినదో" అన్న సమస్యని

మ్రింగెడివాడు విభుండని
మ్రింగెడిది గరళమని, మేలని ప్రజకుం
మ్రింగుమని సర్వమంగళ
మంగళ సూత్రము నెంతమది నమ్మినదో.

లోక కళ్యాణార్థం గరళాన్ని శివుడే మ్రింగాలని పార్వతీ దేవి తన మాంగల్యాన్ని నమ్ముకున్నది అన్నది కవి భావన.

అష్టావధానాల్లో సమస్యా పూరణం ఉంటుంది. ఎందరెందరో ఎన్నో అష్టావధానాలు చేసి ఎన్నో చాటువులను చెప్పారు. మచ్చుకి ముచ్చటగా మూడు తెలియజేస్తాను "కప్పను జూడంగ పాము గడగడ వణికెన్" అన్న సమస్యను ఈ విధంగా పూరించారు.

కుప్పలి కావలి పనిలో
జెప్పులు కట్టయును బూని శ్రీఘ్రముతోడం
జప్పుడగుచు వచ్చెడి వెం
కప్పను జూడంగ బాము గడగడ వణికెన్

"ఎలుకలు తమ కలుగులోని కేనుగు నీడ్చెన్ " అన్న సమస్యా పూరణం ఇలా జరిగింది.

ఇలలో నిద్దరు రాజులు
మలయుచు చదరంగ మాడ మాపటి వేళన్
బలమెత్త కట్ట మరచిన
ఎల్కలు తమ కలుగులోని కేనుగు నీడ్చెన్.

పొడుపు పద్యాలు కూడా చాటువులువులుగా చెప్పారు కొందరు.

మూడు శిరములుండు, ముదమొప్ప పదికాళ్ళు
కరములుండ రెండు, కన్నులారు
కొమ్ము లెన్న నాలుగును, తోకలును రెండు
దీని భావమేమి తిరుమలేశ!

మూడు తలలు, పదికాళ్ళు, రెండు చేతులు, ఆరు కన్నులు, నాలుగు కొమ్ములు, రెండు తోకలున్నది బండి యెడ్లు, మనిషి అన్నదే చమత్కారము.

(ముగింపు వచ్చేనెలలో)